

ఆవాసాలు.. ఆధునిక వసతులు

నవరత్నాలు- పేదలందరికీ ఇళ్లు పథకంలో గృహాలు పొందిన లబ్ధిదారుల ఆనందం వారి మాటల్లోనే.. - 8లో



పండుగ వాతావరణంలో 'సంక్షేమం'

ప్రభుత్వం అమలు చేయనున్న సంక్షేమ పథకాలను పండుగలా అందించాలని కలెక్టర్ ఆదేశించారు. - 8లో



సమస్యలకు సత్వర పరిష్కారం

జిల్లాలో ఎస్టీ, ఎస్సీల సమస్యలను సత్వరమే పరిష్కరిస్తున్నట్లు ఎంపీ రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు తెలిపారు. - 8లో

న్యూస్‌రీల్

బాధ్యతగా విధుల నిర్వహణ



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ ప్రభావతీదేవి

చిత్తూరు రూరల్ : వైద్య సిబ్బంది బాధ్యతగా విధులు నిర్వర్తించాలని డీఎంహెచ్‌ఓ ప్రభావతీదేవి ఆదేశించారు. శుక్రవారం చిత్తూరులోని వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో డాక్టర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వైద్య రంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. వైద్యసేవలను ప్రజలకు మరింత చేరువచేసిందని తెలిపారు. ప్రభుత్వ ఆశయాలను నెరవేర్చేలా పనిచేయాలని సూచించారు.

బాబు హయాంలోనే దోపిడీ



మాట్లాడుతున్న ఎంపీ రెడ్డెప్ప

చిత్తూరు కలెక్టరేట్: చంద్రబాబు హయాంలోనే కుప్పంలో మైనింగ్ దోపిడీ యథేచ్ఛగా సాగించదని ఎంపీ రెడ్డెప్ప ఆరోపించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఆయన మాట్లాడుతూ జైలుకు వెళ్లి వచ్చాక చంద్రబాబునాయుడుకు మతి భ్రమించిందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై నిందలు మోపితే సహించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. కుప్పం నియోజకవర్గంలోని గుడుపల్లె ధర్మరాజ స్వామి గుడికి టీడీపీ పాలనలో రూ.50 లక్షలు ఇవ్వగా, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.2.50 కోట్లతో అభివృద్ధి చేసిందన్నారు. చంద్రబాబే ఎక్కువ మందికి మైనింగ్ లైసెన్స్‌లు ఇచ్చారన్నారు. దీనిపై కుప్పం బస్టాండులో ప్రజాభిప్రాయం పెడితే వాస్తవాలు వెలుగు చూస్తాయని వెల్లడించారు. చంద్రబాబునాయుడు కుప్పం ఓటరు కాదని, పక్క రాష్ట్రంలో ఉంటూ ఇక్కడికి వచ్చి పోటీ చేస్తున్నారని విమర్శించారు. కుప్పంలో సొంత ఇల్లు కూడా లేని బాబును ప్రజలు నమ్మడం లేదని తెలిపారు. ఎన్ని పార్టీలతో పొత్తు పెట్టుకున్నా ప్రయోజనం లేదని తెలిపారు. సమావేశంలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

పోలింగ్ సిబ్బంది నియామకానికి ప్రాధాన్యం



మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : పోలింగ్ సిబ్బంది నియామకాని అత్యంత ప్రాధాన్యమివ్వాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా ఆదేశించారు. ఆయన శుక్రవారం విజయవాడ నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం నిబంధనల మేరకు పారదర్శకమైన ఓటరు జాబితా ప్రచురణకు కసరత్తు చేస్తున్నామన్నారు. త్వరలో జరిగే ఎన్నికల నిర్వహణకు కొత్తగా హ్యాండ్‌బుక్‌లు రూపొందించారని చెప్పారు. ఆ మేరకు సిబ్బందికి త్వరలో శిక్షణ ఇచ్చేందుకు చర్యలు చేపడుతామన్నారు. కాన్ఫరెన్స్‌లో డీఆర్‌ఓ రాజశేఖర్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ బ్యూలా పాల్గొన్నారు.

అందరికీ ఆరోగ్యం

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ ఆవిష్కరణకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.. ప్రజారోగ్య రక్షణకు పెద్దపీట వేస్తోంది.. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌లో భాగంగా కుగ్రామాలకు సైతం వైద్యసేవలను తీసుకువెళుతోంది.. జగనన్న ఆరోగ్య సురక్ష పథకం కింద క్షేత్రస్థాయిలో వ్యాధిగ్రస్తులను గుర్తించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తోంది.. అవసరమైన వారికి అత్యాధునిక ఆస్పత్రుల్లో శస్త్రచికిత్సలు చేయిస్తోంది.. ఈ క్రమంలోనే ఆరోగ్యశ్రీ పరిమితిని విప్లవాత్మకంగా రూ.25లక్షలకు పెంపుదల చేసింది.. పేదలు కూడా ధైర్యంగా కార్పొరేట్ వైద్య పొందేలా భరోసా కల్పిస్తోంది.

- ఇంటి ముంగిటకే వైద్య సేవలు
- జగనన్న ఆరోగ్య సురక్ష కింద వివిధ పరీక్షలు
- క్షేత్రస్థాయిలో 'ఫ్యామిలీ డాక్టర్' అమలు
- అందుబాటులో రూ.25లక్షల హెల్త్ కార్డు
- ప్రజారోగ్య రక్షణే లక్ష్యంగా ప్రభుత్వ అడుగులు



సురక్ష శిబిరంలో కళ్లజోళ్ల పంపిణీ (ఫైల్)


చిత్తూరు రూరల్ : పేదలపై రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది వరుసగా ఆరోగ్య వరాలు కురిపించింది. జగనన్న ఆరోగ్య సురక్ష విధానంతో ప్రజలకు వైద్యాన్ని చేరువ చేయడమే కాకుండా వైఎస్సార్ ఆరోగ్య శ్రీ పథకంలో చికిత్సలను 3,257లకు విస్తరించింది. అలాగే ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5లక్షల ఉంచి రూ.25లక్షలకు పెంచింది. ఈ మేరకు కొత్త ఫీచర్స్‌తో కూడిన ఆరోగ్య స్మార్ట్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేస్తోంది. ఇప్పటికే అమలులో ఉన్న ఫ్యామిలీ డాక్టర్ విధానంతో గ్రామీణ ప్రాంతాల్లో సైతం వైద్యసేవలు అందిస్తోంది. ప్రభుత్వం చేపట్టిన వినూత్న కార్యక్రమాలపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.



చిన్నారులకు టీకా వస్తున్న వైద్య సిబ్బంది (ఫైల్)

494 వైద్యశిబిరాలు

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్షతో పథకంలో భాగంగా అక్టోబర్ నుంచి 45 రోజులపాటు జిల్లావ్యాప్తంగా మొత్తం 494 వైద్య శిబిరాలను నిర్వహించారు. బీపీ, షుగర్ తోపాటు కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి శస్త్రచికిత్సలు చేయించారు. ఈ క్రమంలోనే ఆరోగ్యశ్రీ సేవలతో రూపొందించిన 4,92,963 స్మార్ట్ కార్డులను ముమ్మరంగా పంపిణీ చేస్తున్నారు. ఈ ఏడాది జిల్లాలోని 7 ఆరోగ్య శ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల ద్వారా 63,691 మందికి ఉచిత వైద్య సేవలు అందించారు. ఇందుకోసం ప్రభుత్వం మొత్తం రూ.12.43 కోట్లు వెచ్చించింది. ఆరోగ్య ఆసరా కింద 27,816 మందికి రూ.13.25 కోట్లు మంజూరు చేసింది. అలాగే పీహెచ్‌సీలను 24 గంటలు పనిచేసేలా ఆదేశాలు జారీ చేసింది. గుండె పోటు నివారణకు స్టెమీ కార్యక్రమం చేపట్టింది. జిల్లాలోని 12 ఆస్పత్రుల్లో స్పోక్ సెంటర్లు ఏర్పాటు చేసి రూ.30 వేల నుంచి రూ. 40 వేల విలువైన థ్రాంబో లైసిస్ ఇంజెక్షన్ వేయిస్తోంది.



'సురక్ష' వివరాలు	
మొత్తం ఆరోగ్య శిబిరాలు	494
వైద్యం సేవలందుకున్నవారు	14,12,477 మంది
ఇతర ఆస్పత్రులకు రెఫర్ చేసినవారు	2,688
కంటిపరీక్షలు చేయించుకున్నవారు	27,367
శస్త్ర చికిత్సలు పూర్తయినవారు	879

సేవలు బావున్నాయి



ఇది వరకు ప్రభుత్వాస్పత్రి అంటే భయపడేవాళ్లం. జ్వరానికి వెళితే కూడా మందులు దొరికేవి కావు. ఇప్పుడు అలా లేదు. మంచిగా చూస్తున్నారు. ఏ జబ్బుకైనా చక్కటి మాత్రలు ఇస్తున్నారు. వ్యాధి తీవ్రతను బట్టి పర్యవేక్షణలో ఉంచుతున్నారు. డాక్టర్లే మా ఇంటికి వచ్చి కూడా చూస్తున్నారు.

– ఆశ, జీడీనెల్లూరు

పేదలకు మేలు



వైద్య సేవల్లో పేదలకు అవసరమైనంత వరకు సేవ చేస్తున్నారు. ఆరోగ్యశ్రీ పథకం పరిమితిని రూ.25 లక్షల వరకు పెంచడంతో పేదలకు ఎంతో మేలు. తండ్రి బాటలోనే జగనన్న నడుస్తూ ప్రజలకు ఆరోగ్య అభయం ఇస్తున్నారు. పల్లెల్లో కూడా ఆస్పత్రులను కట్టించారు. అవసరాలకు తగ్గట్టు మాత్రలను సైతం ఉచితంగా ఇస్తున్నారు.

– పెద్దబ్బనాయుడు, జీడీనెల్లూరు

కంటి చూపు వచ్చింది



జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల ద్వారా నా కంటికి శస్త్ర చికిత్స చేయించారు. ఇప్పుడు నాకు చాలా బాగా కనిపిస్తోంది. ఇదే ఆపరేషన్ డబ్బు పెట్టి చేయించుకునే స్తోమత నాకు లేదు. ప్రభుత్వం పుణ్యాన నాకు కంటి వచ్చింది. ఉచితంగా కళ్లజోడు సైతం అందించారు. – చిన్నదొరై, చిత్తపార, గుడిపాల మండలం

కళ్ల జోడు ఇచ్చారు



నాకు కంటి చూపు తక్కువ ఉండడంతో పూతలపట్టు సమీపంలోని పి.కొత్తకోట సీహెచ్‌సీలో పరీక్ష చేయించుకున్నా. వారంలోనే నాకు ఉచితంగా కళ్లజోడు ఇచ్చారు. ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లంటే రూ.వేలు ఖర్చయ్యేది. ప్రభుత్వం పేదల అవసరాలను తెలుసుకుని వైద్యసేవలు అందిస్తోంది. – దీప, చిత్తూరు

మా ఊర్లోనే చూపించుకున్నా



ఇది వరకు రోగం వస్తే చిత్తూరు వెళ్లాల్సి వచ్చేంది. ఇప్పుడు మా ఊర్లోకే డాక్టర్ వస్తుండడం చాలా సౌకర్యంగా ఉంది. దీంతో ఇక్కడే చూపించుకుంటున్నాం. ఉచితంగా మందులు కూడా ఇస్తున్నారు. రాజన్నలానే జగనన్న పాలన చాలా బావుంది.

– కుప్పమ్మ, తవణంపల్లె

ఇంటి వద్దనే పరీక్షలు



ఇంత వరకు నేనెప్పుడూ ఇలాంటి వైద్య సేవలు చూడలేదు. మా ఇంటికే వచ్చి బీపీ, షుగర్ పరీక్షలు చేశారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమ ద్వారా క్యాంపులు పెట్టి చికిత్సలు అందిస్తున్నారు. నేను కూడా క్యాంపులో చూపించుకున్నా. కార్పొరేట్ ఆస్పత్రిలో మాదిరిగానే చికిత్స అందించారు.

– రవి, చిత్తూరు

'మరుదుల' త్యాగాలు మరువలేం



మరుదు సోదరుల ప్రతిమలతో ఎమ్మెల్యే ఆరణి, మేయర్ అముద, బుల్లెట్ సురేష్

చిత్తూరు కార్పొరేషన్ : స్వాతంత్ర్య సమరంలో పెరియ మరుదు, చిన్న మరుదుల తాగ్యాలను మరువలేమని, వారి విగ్రహాల ఏర్పాటుకు సహకరిస్తున్న వారికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ బుల్లెట్ సురేష్ తెలిపారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. సుమారు 200 ఏళ్ల కిత్రం బ్రిటీష్ సైన్యంతో మరుదు సోదరులు వీరోచితంగా పోరాడారన్నారు. తెల్లదొరలు పథకం ప్రకారం మరుదు సోదరులతో పాటు 500 మందిని ఉరి తీశారని వెల్లడించారు. ఆ మహనీయుల సేవలను గుర్తు చేసేలా విగ్రహాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించామని, ఇందుకోసం స్థలం కేటాయించడం ఆనందంగా ఉందని చెప్పారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు సహకారంతో స్థానిక గంగినేని పార్కు ఆవరణలో స్థలం ఇచ్చారని వివరించారు. అలాగే పార్కుకు సైతం మరుదు సోదరుల పేరు పెట్టుకోవడానికి అనుమతి మంజూరు చేశారన్నారు. ఈ క్రమంలోనే మేయర్ అముద, చుడా చైర్మన్ పురుషోత్తంరెడ్డి పూర్తి సహకారం అందించారని తెలిపారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ బుల్లెట్ సురేష్ విశేష కృషి కారణంగానే మొదలియార్ల కల సాకారమైందని చెప్పారు. చుడా చైర్మన్ పురుషోత్తంరెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో సమ్మక -రక్క లాగా తమిళనాడులో మరుదు సోదరులు ప్రసిద్ధి చెందారని వెల్లడించారు. మేయర్ అముద మాట్లాడుతూ చిత్తూరులో అమరవీరుల విగ్రహాల ఏర్పాటుకు స్థలం అందించడం ఆనందంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు జ్ఞానజగదీష్ , యువత అధ్యక్షుడు అప్పు, మున్సిపల్ మాజీ చైర్మన్ భాస్కర్, కార్పొరేటర్లు నవీన్, ఆలీ, లక్ష్మణస్వామి, టౌన్ బ్యాంక్ చైర్మన్ రాంగణేష్, మొదలియార్ సంఘం నాయకులు వెంకటేష్, గురుగణేష్ పాల్గొన్నారు.

సభ్యతగా మాట్లాడకుంటే సహించం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి తదితరులు

చౌడేపల్లె : మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై సభ్యత లేకుండా నోటికొచ్చినట్టు రామచంద్రయాదవ్ మాట్లాడితే సహించే ప్రసక్తేలేదని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి హెచ్చరించారు. శుక్రవారం చౌడేపల్లెలో ఆయన మీడియాతో మాట్లాడారు. వార్డు మెంబర్‌గా కూడా గెలవని రామచంద్రయాదవ్ కనీస సంస్కారం లేకుండా స్థాయిని మరచి మాట్లాడుతున్నాడని మండిపడ్డారు. మంత్రి పెద్దిరెడ్డి ఈ పర్యాయం పుంగనూరు నుంచి పోటీ చేయరనే ఫేక్ న్యూస్ పట్టుకుని ఇష్టానుసారం ఊగిపోతూ మాట్లాడుతున్నాడన్నారు. 1979 నుంచి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఎమ్మెల్యేగా పీలేరు నుంచి ప్రాతినిథ్యం వహించారని గుర్తుచేశారు. రాష్ట్ర స్థాయి చరిత్ర, ఫ్యాక్షన్ నేపథ్యం గల కుటుంబాలతో అప్పట్లోనే ఢీకొని విజయం సాధించారని వివరించారు. రామచంద్రయాదవ్‌కు దమ్ము ధైర్యం ఉంటే బందోబస్తు లేకుండా గ్రామాల్లో పర్యటించాలని సవాల్ విసిరారు. మంత్రి పెద్దిరెడ్డి నీపై పోటీ చేసేందుకు వెనకడుగు వేస్తున్నారని ఆరోపించడం హాస్యాస్పదమన్నారు. మంత్రి పేరెత్తే అర్హత కూడా రామచంద్రయాదవ్‌కు లేదని స్పష్టం చేశారు. ప్రాజెక్టుల్లో అవినీతి, ఇసుక, ఎర్రచందనం దోపిడీ అంటూ అసత్య ప్రచారాలకు పాల్పడితే తగిన బుద్ధి చెప్పాల్సి వస్తుందని హెచ్చరించారు. తక్కువ ధరకు కోట్ చేసిన వారికే టెండర్ దక్కుతుందని, ఆ మాత్రం తెలియకుండా అజ్ఞానంతో మాట్లాడితే ఊరుకోమన్నారు. మరో ఇరవై ఏళ్ల పాటు పుంగనూరు నుంచే మంత్రి పెద్దిరెడ్డి ప్రాతినిధ్యం వహిస్తారని వెల్లడించారు. 2024 ఎన్నికల తర్వాత పుంగనూరు నుంచి రామచంద్రయాదవ్ వెళ్లిపోవడం తథ్యమని స్పష్టం చేశారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు దామోదర రాజు, ఎంపీపీ రామమూర్తి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అంజిబాబు, సింగిల్‌విండో చైర్మన్ రవిచంద్రారెడ్డి, బోయకొండ ఆలయ కమిటీ సభ్యుడు పవన్, పీహెచ్‌సీ కమిటీ చైర్మన్ కల్యాణ్, ఎంపీటీసీ సభ్యుడు శ్రీరాములు, డీసీసీబీ డైరెక్టర్ రమేష్ నాయుడు, స్థానిక నేతలు సుబ్రమణ్యంరాజు, చెంగారెడ్డి, శంకర్‌రెడ్డి, బాబు పాల్గొన్నారు.

నేడు సంకటహార చతుర్థి వ్రతం

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో శనివారం సంకటహార చతుర్థి వ్రతం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు తెలిపారు. ఉదయం 10 గంటలకు, సాయంత్రం 5 గంటలకు నిర్వహించే వ్రతానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వెల్లడించారు. సాయంత్రం 7 గంటలకు స్వామివారిని బంగారు రథంలో ఊరేగించనున్నట్లు వివరించారు.

ద్రవిడ వర్సిటీ వీసీగా మధుజ్యోతి



బాధ్యతలు స్వీకరిస్తున్న మధుజ్యోతి

కుప్పం : ద్రవిడ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్‌గా ఆచార్య కొలకలూరి మధుజ్యోతి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి వీసీగా నియమించినందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. వర్సిటీ అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తామని వెల్లడించారు. అనంతరం వీసీని రిజిస్ట్రార్ వేణుగోపాల్‌రెడ్డి, రెక్టార్ అనూరాధ ఘనంగా సత్కరించారు.

పేద విద్యార్థులకు దీవెన


- జగనన్న విద్యాదీవెన కింద మూడో త్రైమాసికం నిధుల విడుదల
- కలెక్టరేట్‌లో ఘనంగా జిల్లా స్థాయి కార్యక్రమం
- 30,111 మందికి రూ.18.72 కోట్ల జమ



మెగాచెక్కును అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

చిత్తూరు కలెక్టరేట్: పేద విద్యార్థులు సైతం పెద్ద చదువులు అభ్యసించేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేయూతనందిస్తోందని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జూలై-సెప్టెంబర్ త్రైమాసికం కింద జగనన్న విద్యాదీవెన నిధుల విడుదలపై జిల్లా స్థాయి కార్యక్రమం నిర్వహించారు. ముందుగా వర్చువల్ విధానంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రసంగాన్ని విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, అధికారులు వీక్షించారు. జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ క్రమం తప్పకుండా విద్యాదీవెన నిధులు విడుదల చేస్తున్నారన్నారు. పేద విద్యార్థుల కుటుంబాల్లో వెలుగులు నింపేందుకే జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన పథకాలను అమలు చేస్తున్నారని వెల్లడించారు. కులాలు, మతాలు, పార్టీలకు అతీతంగా అర్హులందరికీ విప్లవాత్మకంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారని వివరించారు. ఎంపీ ఎన్.రెడ్డెప్ప మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన అన్ని సామాజిక వర్గాల విద్యార్థులకు ప్రభుత్వం మేలు చేకూరుస్తోందని తెలిపారు. పిల్లల చదువు భారం భరిస్తూ తల్లిదండ్రులపై ఒత్తిడి తగ్గిస్తోందని వెల్లడించారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ విద్యారంగానికి ముఖ్యమంత్రి జగనన్న పెద్ద పీట వేస్తున్నారన్నారు. చదువుతోనే సామాజిక అభ్యున్నతి సాధ్యమని ముఖ్యమంత్రి విశ్వసిస్తున్నారని వివరించారు. కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ ఐటీఐ, పాలిటెక్నిక్, ఇంజినీరింగ్, ఫార్మసీ, అన్ని డిగ్రీ స్థాయి కోర్సుల విద్యార్థులకు ప్రభుత్వం విద్యాదీవెన కింద లబ్ధి చేకూరుస్తోందని వెల్లడించారు. మూడో త్రైమాసానికి సంబంధించి జిల్లాలోని 30,111 మంది విద్యార్థులకు రూ.18.72 కోట్లను 27,721 మంది తల్లుల జాయింట్ ఖాతాల్లో జమచేసినట్లు వివరించారు. అనంతరం జగనన్న విద్యాదీవెన మెగా చెక్కును విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో మేయర్ అముద, జెడ్పీ వైస్ చైర్మన్ రమ్య, మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ బుల్లెట్ సురేష్, జిల్లా సాంఘిక, బీసీ, గిరిజన సంక్షేమ శాఖల అధికారులు రాజ్యలక్ష్మి, రబ్బానీ బాషా, మూర్తి పాల్గొన్నారు.

ఆర్థిక భారం తప్పింది



మాది నిరుపేద కుటుంబం. నా తండ్రి టీస్టాల్ నిర్వహిస్తూ నన్ను చదివిస్తున్నారు. జగనన్న విద్యా దీవెన పథకం నాకు అందుతోంది. నా ఉన్నత చదువుకు ముఖ్యమంత్రి చేస్తున్న ఆర్థిక సహాయం మరువలేనిది. సకాలంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బులు ఇస్తున్నారు. ప్రభుత్వం చేస్తున్న మేలుతో నా తల్లిదండ్రులకు ఆర్థిక భారం తప్పింది.

– జయంత్, ఇంజినీరింగ్ విద్యార్థి, చిత్తూరు

మేలు మరువలేం



మాది పేద కుటుంబం. నాన్న చిరువ్యాపారం చేస్తూ మా కుటుంబాన్ని పోషిస్తుంటారు. రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న జగనన్న విద్యాదీవెన ఆర్థిక సహాయాన్ని మూడేళ్లుగా పొందుతున్నా. ఈ పథకం నా చదువుకు ఎంతో ఉపయోగపడుతోంది. నా తల్లిదండ్రులకు అప్పులు చేయాల్సిన పరిస్థితి తప్పింది. కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా నేరుగా అకౌంట్‌లో నగదు జమచేస్తోంది. మాకు ఇంత సాయం చేస్తున్న జగనన్న మేలు మరువలేం.

– గాయత్రి, ఇంజినీరింగ్ విద్యార్థిని, చిత్తూరు

క్లుప్తంగా

పండగ వాతావరణంలో 'సంక్షేమం'


కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : నూతన సంవత్సరంలో ప్రభుత్వం అమలు చేయనున్న వైఎస్సార్ పింఛన్ కానుక, ఆసరా కార్యక్రమాలను పండగ వాతావరణంలో నిర్వహించాలని కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి ఆయన క్షేత్రస్థాయి అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ జనవరి 1వ తేదీ నుంచి రూ.3వేలకు పెంచిన పింఛన్ అందిస్తున్నట్లు వెల్లడించారు. పింఛన్ల పండుగను 8వ తేదీ వరకు చేపట్టాలని సూచించారు. అలాగే జనవరి 23న వైఎస్సార్ ఆసరా, ఫిబ్రవరి 5న వైఎస్సార్ చేయూత పథకాలు ఉంటాయని వివరించారు. ఆయా కార్యక్రమాలను గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి వరకు నిర్వహించాలని తెలిపారు. ప్రజా ప్రతినిధులను భాగస్వాములు చేయాలని కోరారు. సమావేశంలో డీఆర్‌ఓ రాజశేఖర్, జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, పలు శాఖల అధికారులు తులసి, రాధమ్మ, గంగాభవానీ, రాజ్యలక్ష్మీ, రవికుమార్, ప్రదీప్ కుమార్ పాల్గొన్నారు.

ఏఎస్పీగా శివరామిరెడ్డి

చిత్తూరు అర్బన్: తిరుపతి జిల్లా తిరుమల ఏఎస్పీగా శివరామిరెడ్డికి ప్రభుత్వం శుక్రవారం ఉద్యోగోన్నతి కల్పిస్తూ బదిలీ చేసింది. ఈయన విశాఖపట్నం ఏసీగా విధులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం కల్పించిన ఉద్యోగోన్నతిలో భాగంగా లా అండ్ ఆర్డర్ ఏఎస్పీగా తిరుమలకు బదిలీ అయ్యారు. ఈయన త్వరలో బాధ్యతలు స్వీకరించినున్నట్లు సమాచారం.

సమస్యలకు సత్వర పరిష్కారం

- డీవీఎంసీ సమావేశంలో ఎంపీ రెడ్డెప్ప


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ రెడ్డెప్ప

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ఎస్సీ, ఎస్టీల సమస్యలను సత్వరం పరిష్కరిస్తున్నట్లు ఎంపీ రెడ్డెప్ప తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ (డీవీఎంసీ) సమావేశం నిర్వహించారు. జేసీ శ్రీనివాసులు అధ్యక్షత వహించిన సమావేశంలో ఎంపీ రెడ్డెప్ప మాట్లాడుతూ గతంతో పోలిస్తే ప్రస్తుతం ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసులు చాలా తగ్గాయని చెప్పారు. వలంటీర్, సచివాలయ వ్యవస్థ ఆధ్వర్యంలో సంక్షేమ పథకాలను అర్హుల ఇంటి వద్దకే చేరుస్తున్నామన్నారు. జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు మాట్లాడుతూ టీడీపీ పాలనలో ఎస్సీ,ఎస్టీలకు ఎలాంటి మేలు కలగలేదన్నారు. ఎస్సీ,ఎస్టీ కాలనీల అభివృద్ధికి జెడ్పీ నిధులు కేటాయించినట్లు చెప్పారు. జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో తప్పనిసరిగా డివిజన్ స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ సమావేశాలు నిర్వహించాలన్నారు. లేకుంటే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. దళిత వాడల్లో శ్మశాన వాటికల అభివృద్ధికి అధిక ప్రాధాన్యతనిస్తున్నట్లు వెల్లడించారు. సఫాయి కర్మచారీ కమిషన్ సభ్యుల పర్యటనలో తెలిపిన అంశాలను పరిశీలించి చర్యలు చేపట్టినట్లు సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రాజ్యలక్ష్మీ వెల్లడించారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ శ్రీలక్ష్మీ, ఆర్డీఓలు చిన్నయ్య, మనోజ్‌కుమార్, పలు శాఖల అధికారులు పద్మనాభం, గంగాభవాని, లక్ష్మీ, మూర్తి, డీవీఎంసీ సభ్యులు బాబు, దేవరాజులు, డేవిడ్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏనుగుల దాడిలో పంటల ధ్వంసం


ఏనుగులు తొక్కేసిన జొన్న పంట

వి.కోట: మండలంలోని కుదవగడ్డ గ్రామంలో పలువురు రైతులు సాగు చేస్తున్న పంటలపై గురువారం రాత్రి ఏనుగుల గుంపు దాడి చేసింది. మొక్కజొన్న, మామిడి, టమాట పంటలను ధ్వంసం చేశాయి. ఇప్పటికైన అటవీ అధికారులు స్పందించి ఏనుగులను కట్టడి చేయాలని బాధిత రైతులు కోరుతున్నారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

ఐరాల : విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం ఐరాల ఎంపీడీఓ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. పనివేళ పూర్తికాక ముందే సిబ్బంది వెళ్లిపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశబూరు. ఆడుదాం ఆంధ్రాకు సంబంధించి సక్రమంగా ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయకపోవడంపై మండిపడ్డారు. వికసిత్ సంకల్ప యాత్ర, ఆరోగ్యశ్రీ తదితర ప్రోగ్రామ్‌లను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. విధులకు డుమ్మా కొట్టిన వారిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఎంపీడీఓ నాగరాజా, ఈఓపీఆర్‌డీ కుసుమకుమారి పాల్గొన్నారు.

ఆవాసాలు.. ఆధునిక వసతులు

నవరత్నాలు– పేదలందరికీ ఇళ్లు పథకం కింద ప్రభుత్వం జిల్లాలో వందలాది జగనన్న కాలనీలకు శ్రీకారం చుట్టింది. నిరుపేదల సొంతింటి కలను సాకారం చేస్తూ చిత్తశుద్ధితో అడుగులు వేస్తోంది. అందులో భాగంగా అత్యాధునిక మౌలిక వసతులతో లేఅవుట్‌లను తీర్చిదిద్దుతోంది. వేలాది ఆవాసాలతో ఏకంగా ఊర్లనే ఆవిష్కరిస్తోంది. ప్రతిష్టాత్మక పథకంపై లబ్ధిదారుల ఆనందం వారి మాటల్లోనే..
– చిత్తూరు కలెక్టరేట్


ప్రభుత్వం నిర్మించిన ఇళ్లు



రుణపడి ఉంటాం



సుమారు 20 ఏళ్లుగా ఇంటి స్థలం కోసం గత పాలకులకు, అధికారులకు పలుమార్లు దరఖాస్తు చేసుకున్నాం. అయితే మమ్మల్ని ఎవరూ పట్టించుకోలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాగానే వలంటీర్ మా ఇంటికే వచ్చి దరఖాస్తు తీసుకున్నారు. వెనువెంటనే స్థలం, పక్కా ఇల్లు మంజూరైంది. సర్కారు అందించిన ఆర్థిక సాయంతో శరవేగంగా ఇల్లు నిర్మించుకున్నాం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చలువతో మా సొంతింటి కల నెరవేరింది. ఆయనకు ఎప్పటికీ రుణపడి ఉంటాం.
– ఉమామహేశ్వరి, లక్కనపల్లె, బైరెడ్డిపల్లె మండలం

మేలు మరువలేం



దాదాపు 30 ఏళ్లుగా అద్దె ఇంట్లోనే ఉండేవాళ్లం. జగనన్న పుణ్యమా అని పక్కా ఇల్లు మంజూరైంది. ఉచితంగా స్థలం అందించడంతో పాటు ఇల్లు కట్టుకునేందుకు చేయూతనందించారు. మాకు స్థలం ఇచ్చినన కాలనీలో అన్ని సౌకర్యాలు కల్పించారు. ఇప్పుడు ఆహ్లాదకర వాతావరణంలో, మా సొంత ఇంటిలో నివసిస్తున్నాం. మా జీవితంలో వెలుగులు నింపిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేలు ఎన్నటికీ మరువలేం.
– సుబ్బమ్మ, చిన్నపురం, బైరెడ్డిపల్లె మండలం

కల సాకారం



మాది నిరుపేద కుటుంబం. ఇద్దరు చెల్లెళ్లు వికలాంగులు. వారికి వివాహం కాకపోవడంతో నా వద్దే ఉంటున్నారు. కూలి పనులు చేస్తూ నా ఇద్దరు బిడ్డలతో పాటు చెల్లెళ్లను పోషించుకుంటున్నా. చిన్న పూరి గుడిసెలో జీవనం సాగిస్తున్నా. సొంతింటి కోసం గతంలో అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఎన్ని సార్లు విన్నవించినా ఫలితం లేదు. ప్రస్తుతం జగనన్న కాలనీలో స్థలం ఇవ్వడంతో పాటు ఇంటి నిర్మాణానికి డబ్బులు ఇచ్చారు. మా సొంతింటి కల సాకారం చేశారు.
– మొగిశమ్మ, శెట్టిపల్లె, బైరెడ్డిపల్లె మండలం

సంతోషంగా ఉంది



రెక్కాడితే కానీ డొక్కాడని నిరుపేద కుటుంబం మాది. కూలి పనికి వెళితేనే నోట్లోకి నాలుగు వేళ్లు వెళ్లే పరిస్థితి. వచ్చే కాస్త సంపాదనలో అధిక భాగం ఇంటి అద్దెకే సరిపోయేది. అద్దె భారంతో సతమతమవుతున్న మా లాంటి పేదలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇంటి స్థలం మంజూరు చేశారు. ఇంటి నిర్మాణానికి సైతం సాయం చేశారు. విలువైన స్థలంలో ఇల్లు కట్టుకుని నివసిస్తున్నాం. ఈ ఇల్లు మా సొంతం అనుకుంటేనే చాలా సంతోషంగా ఉంది.
– విజయలక్ష్మి, తొరిడి, బైరెడ్డిపల్లె మండలం

జగనన్నకు కృతజ్ఞతలు



గత టీడీపీ ప్రభుత్వంలో ఇంటి పట్టా కోసం ఎన్నో సార్లు అధికారుల చుట్టూ తిరిగా. జన్మభూమి కమిటీల్లో అప్పటి నాయకుల వద్ద చాలా అర్జీలు ఇచ్చా. ఎవరూ మా మొర వినలేదు. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత వలంటీరు మా ఇంటికే వచ్చి దరఖాస్తు తీసుకెళ్లాడు. మా గ్రామ సమీపంలో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీలో స్థలం కేటాయించారు. ప్రభుత్వం అందించిన సాయంతో ఇల్లు నిర్మించుకున్నాం. మా కల నెరవేర్చిన జగనన్నకు కృతజ్ఞతలు.
– రెడ్డెమ్మ, రామనపల్లె, బైరెడ్డిపల్లె మండలం

కాణిపాకం చరిత్రీకరణకు వినతి


పీఠాధిపతికి ఆలయ గ్రంథం అందిస్తున్న మోహన్ రెడ్డి తదితరులు

కాణిపాకం(యాదమరి): కాణిపాకంవరసిద్ధి వినాయక స్వామి ఆలయ చరిత్రను లిఖించేందుకు అనుమతివ్వాలని శృంగేరి పీఠాధిపతులకు కాణిపాక ఆలయ కమిటీ చైర్మన్ మోహన్ రెడ్డి, ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి విన్నవించారు. శుక్రవారం కర్ణాటకలోని శృంగేరి పీఠాన్ని వారు సందర్శించారు. పీఠాధిపతులకు వరసిద్ధుని శేష వస్త్రాలు, తీర్థ ప్రసాదాలు అందించారు. వారు మాట్లాడుతూ పీఠాధిపతులు అనుమతిస్తే రచయిత ఆంజనేయశర్మతో ఆలయ చరిత్ర రాయించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఎక్స్ అఫిషియో సభ్యుడు సోమశేఖర్ గురుకుల్, వేదపండితులు సోమశేఖర్ గురుకుల్, రాకేష్ శర్మ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్ పోటీల్లో ప్రతిభ చాటారని జిల్లా సైన్స్ అధికారి వెంకటరమణ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైఎస్సార్ కడప జిల్లాలో ఈ నెల 28, 29 తేదీల్లో రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్ పోటీలు నిర్వహించారని చెప్పారు. ఈ పోటీలకు జిల్లాస్థాయిలో ఎంపికైన 9 ప్రాజెక్టులను అక్కడ ప్రదర్శించినట్లు తెలిపారు. ఇందులో 3 ప్రాజెక్టులు దక్షిణాది రాష్ట్రాల సైన్స్ ఫెయిర్ ఎంపికైనట్లు తెలిపారు. గుడుపల్లి మండలం శెట్టిపల్లె జెడ్పీ హైస్కూల్‌కు లలిత సుభాషిణి (టీచర్స్ ఎగ్జిబిట్), గుడుపల్లి మండలం గుత్తార్లపల్లె జెడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థిని మీనా (విద్యార్థుల వ్యక్తిగత విభాగంలో), పెద్దపంజాణి మండలం మహాత్మజ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలకు చెందిన హేమమాధురి, పావని (విద్యార్థుల గ్రూప్ విభాగంలో) దక్షిణాది రాష్ట్రాల సైన్స్‌ఫెయిర్ కు ఎంపికయ్యాయని చెప్పారు. జనవరి 27 వ తేదీ నుంచి ఫిబ్రవరి ఒకటో తేదీ వరకు విజయవాడలో జరిగే దక్షిణాది రాష్ట్రాల సైన్స్ ఫెయిర్ లో విద్యార్థులు పాల్గొంటారన్నారు. ఆ విద్యార్థులు ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ ప్రతాప్‌రెడ్డి చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారని తెలిపారు.


గ్రూప్ విభాగంలో ప్రతిభ చాటి బహుమతులు అందుకుంటున్న విద్యార్థినిలు

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ


చెక్కు అందిస్తున్న ఎంపీ రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్

గుడుపల్లె/ చిత్తూరు కలెక్టరేట్ : గుడుపల్లె మండలం సోడిగానిపల్లె సర్పంచ్ గోవిందన్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. ఆయన కుటుంబానికి ప్రభుత్వం సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరు చేసిన రూ.5లక్షల చెక్కును శుక్రవారం కలెక్టరేట్‌లో అందించారు. గోవిందన్ చెల్లెలు సుశీలకు ఎంపీ రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, డీఆర్‌ఓ రాజశేఖర్ అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు కృష్ణమూర్తి, పద్మావతి పాల్గొన్నారు.

ఈవ్‌టీజింగ్‌పై ఫిర్యాదు

పలమనేరు : కళాశాలకు వెళ్లే సమయంలో మహేష్ అనే వ్యక్తి ఈవ్ టీజింగ్‌కు పాల్పడుతూ ఇబ్బంది పెడుతున్నాడని ఓ విద్యార్థిని పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేసింది. గతంలో లైంగిక వేధింపులకు సైతం తెగబడ్డాడని, కుటుంబసభ్యులు రక్షించారని పేర్కొంది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లారీని ఢీకొన్న బస్సు : 15 మందికి గాయాలు

బైరెడ్డిపల్లె : వి.కోట నుంచి పలమనేరుకు వెళుతున్న ఆర్టీసీ బస్సు శుక్రవారం బైరెడ్డిపల్లె చెక్‌పోస్టు వద్ద లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో 15 మంది బస్సు ప్రయాణికులు గాయపడ్డారు. తోటకనమకు చెందిన జహీర్‌బాషా, ఎం.కొత్తూరుకు చెందిన సయ్యద్‌బాషా తీవ్రంగా గాయపడడంతో కుప్పం పీఈఎస్‌కు తరలించారు. మరో 13 మందిని బైరెడ్డిపల్లె ప్రభుత్వాసుపత్రిలో చికిత్సలందించారు. బ్రేక్ ఫెయిల్ కావడంతోనే ప్రమాదం జరిగిందని డ్రైవర్ తెలిపాడు.

ఐదుగురు చైన్ స్నాచర్ల అరెస్ట్


నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

పుంగనూరు : పుంగనూరు నియోజకవర్గంలో ఈనెల 20వ తేదీన చైన్ స్నాచింగ్‌లకు పాల్పడిన ముఠాను అన్నమయ్య జిల్లా మదనపల్లె పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. వివరాలు.. పుంగనూరు మండలంలోని సుగాలిమిట్టతాండ, చౌడేపల్లె మండలం బత్తలాపురం, సదుం, కల్లూరులో పలువురు మహిళల మెడలో చైన్లు లాక్కెళ్లిన బెంగళూరుకు చెందిన సయ్యద్‌ఇర్ఫాన్‌పాషా, షేక్ మహమ్మదాలి, షేక్ మహబూబ్‌బాషా, షేక్ అర్షద్‌పాషా, షేక్ అర్బాజ్‌పాషాను కలకడ ఎస్‌ఐ తిప్పేస్వామి అదుపులోకి తీసుకున్నట్లు డీఎస్పీ సయ్యద్ మహమ్మద్ బాషా తెలిపారు. వీరి నుంచి మొత్తం 11 చైన్లు స్వాధీనం చేసుకున్నామని వివరించారు.

శతాధిక వృద్ధురాలి మృతి


పాపమ్మ (ఫైల్)

రామకుప్పం : మండలంలోని కుప్పిగానిపల్లెలో శతాధిక వృద్ధురాలు పాపమ్మ (110) శుక్రవారం మృతి చెందారు. ఆమె మృతికి పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

వ్యక్తి ఆత్మహత్య


సుధాకర్ మృతదేహం

తవణంపల్లె : మండలంలోని జొన్నగురకల గ్రామంలో అప్పులు బాధ తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు హెడ్‌కానిస్టేబుల్ సుబ్రమణ్యం తెలిపారు. వివరాలు.. గ్రామానికి చెందిన సి. సుధాకర్(39) వివిధ అవసరాలకు అధికంగా అప్పులు చేశాడు. తీర్చే పరిస్థితి కనపడకపోవడంతో గ్రామ సమీపంలోని మామిడి తోటలో చెట్టుకు ఉరేసుకున్నాడు. మృతుడి తల్లి జయమ్మ, భార్య సంగీత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

రవాణాశాఖలో ఏసీబీ గుబులు

- భారీ ఆస్తులతో పట్టుబడ్డ ఎంవీఐ
- అవినీతి అధికారుల గుండెల్లో రైళ్లు

చిత్తూరు రూరల్: జిల్లా రవాణాశాఖలో ఏసీబీ గుబులు పట్టుకుంది. అవినీతి అధికారుల వెన్నులో వణుకు పుడుతోంది. ఇందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాటకొండ వెంకట మధుసూదన్‌పై ఏసీబీ చేసిన దాడులే కారణం. ఒకటి కాదు రెండు కాదు కోట్లాది రూపాయల ఆస్తులు, ఆభరణాలతో ఆయన ఏసీబీ చేతికి చిక్కారు. మధుసూదన్‌కు ఆదాయానికి మించి ఆస్తులున్నట్లు ఏసీబీ యాప్‌కు ఇటీవల కొందరు ఫిర్యాదు చేశారు. ఈమేరకు ఏసీబీ సెంట్రల్ ఇన్వెస్టిగేషన్ యూనిట్ అధికారులు రంగంలోకి దిగారు. చిత్తూరు, పలమనేరు, మదనపల్లె, తిరుపతితో పాటు కర్ణాటకలో సైతం మధుసూదన్‌కు చెందిన ఇళ్లు, ఇతర భవనాల్లో సోదాలు మొదలు పెట్టారు. మూడు రోజులుగా కొనసాగుతున్న తనిఖీల్లో భారీగా ఆస్తులు వెలుగు చూశాయి. ఈ అవినీతి అధికారి అక్రమ సొమ్ముకు దళారులే వెన్నెముకగా నిలిచారనే ఆరోపణలు శాఖలో గుప్పుమంటున్నాయి.


ఏసీబీ సోదాల్లో పట్టుబడిన ఆభరణాలతో మధుసూదన్

దళారుల కనుసన్నల్లోనే...

నరహరిపేట, ఇతరత్ర చెక్‌పోస్టుల్లో ప్రైవేటు వ్యక్తులను కొందరు రవాణాశాఖ అధికారులు పెంచి పోషిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లాలోని యూనిట్ కార్యాలయాల్లో సైతం ఇదే తంతు కొనసాగుతున్నట్లు విమర్శలు వెలువెత్తుతున్నాయి. వీరికి అధికారం కట్టబెట్టి వాహనాలను మాటు వేస్తున్నట్లు సమాచారం. దళారులు చెక్ పోస్టు ప్రాంతాల్లో అన్నీ తామై వ్యవహరిస్తూ అక్రమ రవాణాకు రైట్ రైట్ చెబుతున్నారనే ఫిర్యాదులున్నాయి. కొంతమంది హోంగార్డులు సైతం చెక్ పోస్టుల్లో చేతివాటం ప్రదర్శిస్తున్నట్లు తెలుస్తోంది. ఇక కార్యాలయంలో పనిచేసే కొంతమంది అధికారులు వసూళ్ల పర్వంలో మునిగితేలుతున్నారు. మొత్తం మీద జిల్లా రవాణా శాఖల్లో ప్రైవేటు వ్యక్తులదే పైచేయిగా నిలుస్తోంది. ఈ క్రమంలో తాజాగా మధుసూదన్‌పై జరిగిన దాడులతో అధికారుల్లో గుబులు పట్టుకుంది.